సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 06.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 307
పేజీలు: 08 వెల: రూ. 5

## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కో
## సీఎం రేవంత్ సవాల్

- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి
- సిరిసిల్ల, సిద్దిపేటలో గెలుస్తాం
- బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదు
- గజ్వేల్‌లోనే తేల్చుకుందాం
- నకిరేకల్‌లో సభలో రేవంత్


02

# పొలిటికల్ రీసెట్

## కేబినెట్ లో భారీ మార్పులకు రేవంత్ రెడీ

### మూడు ఖాళీలు.. కొత్త ముఖాలకు అవకాశం!



- బీసీ మహిళకు మంత్రి పదవిపై సీఎం వ్యూహం
- పనితీరు ఆధారంగా మంత్రుల శాఖల్లో మార్పులు
- వర్షాకాల సమావేశాల తర్వాత కేబినెట్ విస్తరణ
- ప్రాంతీయ, సామాజిక సమీకరణాలపై సీఎం ఫోకస్
- సీనియర్లకు షాక్.. డైనమిక్ నేతలకు ఛాన్స్?
- కేబినెట్‌తో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ
- లోకల్ బాడీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త కూర్పు

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామానికి రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు కసరత్తు ముమ్మరం చేసింది. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడంతో పాటు.. పనితీరు సరిగ్గా లేని మంత్రుల శాఖల్లో మార్పులు, కొత్త ముఖాలకు అవకాశం కల్పించే అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్టానం నుంచి కూడా కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**మూడు ఖాళీలు.. కొత్త సమీకరణాలు**
ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా కోటాలోనూ ఖాళీ ఏర్పడింది. ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అంశం కూడా ముఖ్యమంత్రికి కీలకంగా మారింది. మూడు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు.. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా చురుకైన నేతలకు అవకాశం కల్పించాలన్న ఆలోచనలో సీఎం ఉన్నట్లు తెలుస్తోంది.

**బీసీ మహిళకు మంత్రి పదవి?**
కొండా సురేఖను తప్పించిన అనంతరం బీసీ మహిళా నేతలకు కీలక పదవులు కట్టబెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి తన సామాజిక సమీకరణాల వ్యూహాన్ని స్పష్టం చేశారు. గద్వాల విజయలక్ష్మికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, నేరెళ్ల శారదకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా, గుండు సుధారాణికి కుడా ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడం ఇందులో భాగంగానే రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మిగతా 02లో

# రేవంత్‌రెడ్డి కల సాకారం

### ఫ్యూచర్ సిటీలో రూ.70 వేల కోట్ల భారీ పెట్టుబడి

## ఫ్యూచర్ సిటీకి భారీ ప్రాజెక్టు

- హైదరాబాద్‌లో 1 గిగావాట్ మెగా ఏఐ డేటా సెంటర్
- టీసీఎస్ పెట్టుబడితో 7 వేల ఉద్యోగాల కల్పన
- ఏఐ డేటా సెంటర్‌కు తెలంగాణతో టీసీఎస్ ఒప్పందం
- రేవంత్‌తో టీసీఎస్ హైపర్‌వాల్ట్ ప్రతినిధుల బృందం భేటీ



**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్‌లో దేశంలోనే అత్యంత అధునాతన, అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు కావడం తెలంగాణకే కాకుండా దేశానికే చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. టీసీఎస్ అనుబంధ సంస్థ 'హైపర్ వాల్ట్' ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. హైదరాబాద్‌లో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో మెగా ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

**నా ఫ్యూచర్ సిటీ కల సాకారమైంది**
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండడం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు.

**రూ.70 వేల కోట్ల ఇన్వెస్ట్ మెంట్.. 7 వేల ఉద్యోగాలు**
హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్ తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. మిగతా 02లో

# నాయకత్వ లోపమే..

### అవకాశం ఎదురుగా ఉన్నా అందుకోలేకపోతున్న కమలం!

- బీజేపీకి అనుకూల పవనాలు
- ఓటు బ్యాంకు ఉన్నా గెలుపుగా మలచుకోలేకపోతున్న వైనం
- బలమైన నాయకత్వం కొరతే ప్రధాన అడ్డంకా?
- బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై స్పష్టత కరవు
- పవర్ లోకి రావాలంటే గల్లీ స్థాయి నుంచి నిర్మాణం తప్పనిసరి

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం భారతీయ జనతా పార్టీకి స్పష్టంగా కనిపిస్తున్నా.. ఆ అవకాశాన్ని పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవడంలో పార్టీ తడబడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గణనీయమైన ఫలితాలు సాధించి, రాష్ట్ర రాజకీయాల్లో తన బలాన్ని చాటుకున్న కమలం పార్టీ.. ఆ ఊపును అసెంబ్లీ నియోజకవర్గాలు, స్థానిక సంస్థలు, గ్రామీణ స్థాయికి విస్తరించడంలో మాత్రం మిగతా 02లో



## అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు

### ఇచ్చేందుకు ఏపీ సీఎం అంగీకారం


02

- ఉద్యోగులకు గుడ్ న్యూస్
- పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

## రెండేళ్లు ఓపిక పట్టండి

### ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ హామీ


02

## పాక్ సైన్యంపై బలోచ్ మెరుపుదాడి

03

### 25 మంది పాక్ సైనికులు హతం..

- పాకిస్తాన్ సైన్యానికి చుక్కలు చూపిస్తున్న బీఎల్ఏ..
- బలూచ్ రెబల్స్ జరిపిన దాడుల్లో 25 మంది జవాన్లు హతం..



# చిట్టినాయుడు లెక్కనే కాదు

### మోదీనే జెన్‌జీ గడగడలాడించారు.. రేవంత్ ఎంత?

- కేసీఆర్‌తో పెట్టుకోవద్దు యాదిలో పెట్టుకో రేవంత్
- కాంగ్రెస్ 420 హామీలకు 420 సార్లు రాజీనామా చేయాలి
- ఒక్క మంత్రినే బర్తరఫ్ చేశావ్.. ప్రజలు నిన్ను బర్తరఫ్ చేసేందుకు సిద్ధం
- ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ఎన్నికల తర్వాత బూతుల డిక్లరేషన్
- కరీంనగర్ యువ సమరభేరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 06.09.2026
www.mudranews.in | @mudranews



## రెండు పూటల భోజనం సరైన పద్ధతి కాదు



టిఫిన్, లంచ్ పూర్తిగా మానేయడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు, శక్తి అందకపోవచ్చు. భోజనాలు స్కిప్ చేయడం దీర్ఘకాలికంగా బరువు నియంత్రణకు కూడా అనుకూలంగా ఉండకపోవచ్చని NHS సూచిస్తోంది.

# అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు

**ముద్ర, అమరావతి:**
ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. వారితో భేటీతో ఆయనపీఆర్సీ, పెండింగ్ డీఏలు, పెండింగ్ బకాయిలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించారు. సరెండర్ లీవులు జనవరిలో ఇవ్వాలని నిర్ణయించారు. అడిషినల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రిస్టోరేషన్‌కు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని స్ట్రీమ్ లైన్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వచ్చే నెల నుంచి ప్రతినెలా ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టుకు చెల్లించేందుకు చంద్రబాబు అంగీకారం తెలిపారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు సూర్యనారాయణ మాట్లాడుతూ ఐఆర్ ఇచ్చేందుకు కాస్త వెసులుబాటు కావాలని చంద్రబాబు కోరినట్లు తెలిపారు. 24 లక్షల మంది ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యల పరిష్కారంపై చంద్రబాబు హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. పోలీసులకు అదనంగా సరెండర్ లీవు ఇస్తామని చంద్రబాబు చెప్పినట్లు సూర్యనారాయణ పేర్కొన్నారు. పొరుగు సేవల సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని సీఎం చంద్రబాబును తాము కోరామని మరో నేత విద్యాసాగర్ తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బందికి నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని అడగామని ఆయన చెప్పారు.

# రేవంత్ మార్క్
# పొలిటికల్ రీసెట్



**(మొదటి పేజీ తరువాయి)**
ఇదే వ్యూహాన్ని కేబినెట్ విస్తరణలోనూ కొనసాగించి.. బీసీ మహిళకు మంత్రి పదవి ఇవ్వాలనే యోచనలో సీఎం ఉన్నట్లు తెలుస్తోంది. తద్వారా బీసీ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని మరింత బలంగా చాటాలని భావిస్తున్నట్లు సమాచారం.

**'పనితీరు'కే పెద్దపీట**
ఈసారి కేబినెట్ మార్పులు కేవలం సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకే పరిమితం కాకుండా పనితీరు ఆధారంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంత్రుల పనితీరు, శాఖల నిర్వహణ, పార్టీ బలోపేతానికి వారు చేస్తున్న కృషి, రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఉపయోగపడే సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని కొందరు మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించే అంశంపైనా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. కీలకమైన ఐటీ, రెవెన్యూ, నీటిపారుదల వంటి శాఖలను మినహాయించి.. ఇతర శాఖల పోర్ట్‌ఫోలియోలను అవసరానికి అనుగుణంగా పునర్విభజించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**సీనియర్ల ఒత్తిడి.. కొత్తవారికి ఛాన్స్?**
కాంగ్రెస్‌లో మొదటి నుంచీ కొనసాగుతున్న సీనియర్ నేతలు, ఇటీవల పార్టీలో చేరిన నేతల మధ్య సమతుల్యత సాధించడం సీఎం రేవంత్ రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు ఇప్పటికే అధిష్టానం స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి విజయాన్ని అందించగలిగే నాయకత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచనలో సీఎం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కేబినెట్‌లోకి ఎవరికి అవకాశం దక్కుతుంది? ఎవరికి ఉద్వాసన పలుకుతారు? ఎవరి శాఖలు మారతాయి? అన్న అంశాలు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.

**నామినేటెడ్ పదవులపైనా ఒకేసారి నిర్ణయం**
కేబినెట్ విస్తరణతో పాటు పెండింగ్‌లో ఉన్న మరికొన్ని నామినేటెడ్ పదవులను కూడా ఒకేసారి భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తవడం కూడా ప్రభుత్వంలో విస్తృత స్థాయి మార్పులకు సంకేతంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తంగా రాబోయే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక 'పొలిటికల్ రీసెట్'గా మారే అవకాశముంది. సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత, పార్టీ భవిష్యత్ అవసరాలు, మంత్రుల పనితీరు.. ఈ నాలుగు అంశాలను సమన్వయం చేస్తూ కొత్త కేబినెట్ రూపకల్పనకు సీఎం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాల అనంతరం మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారయ్యే అవకాశం ఉండటంతో.. ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల చూపంతా అధిష్టానం నిర్ణయంపైనే ఉంది.

# రేవంత్‌రెడ్డి కల సాకారం..

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.

**దావోస్ లో చర్చల ఫలితం**
ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది.
ఈభేటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.

# నాయకత్వమే సమస్య

**(మొదటి పేజీ తరువాయి)**
ఆశించిన స్థాయిలో ముందుకెళ్లడం లేదు.

**నాయకత్వమే కీలక సమస్య?**
తెలంగాణ బీజేపీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో బలమైన, స్థిరమైన రాష్ట్ర నాయకత్వం కొరత ఒకటిగా కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణలో పార్టీకి కొంత బలమైన పునాది ఉన్నప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించగల సర్వామోదయోగ్యమైన నాయకత్వ ముఖచిత్రం లేకపోవడం ప్రతికూలంగా మారుతోంది. వ్యూహాల్లో మార్పులు, నాయకత్వంపై తరచూ జరుగుతున్న చర్చలు, అంతర్గత విభేదాలు క్యాడర్‌లో అయోమయానికి కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే బలమైన నాయకత్వం అవసరం మరింత స్పష్టమవుతోంది.

**బీఆర్ఎస్‌పై మెతక వైఖరితో నష్టమే?**
బీఆర్ఎస్ విషయంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరిపైనా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై అసంతృప్తిగా ఉన్నవారు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాశ చెందుతున్నవారు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న సమయంలో.. ఆ ఓటు నేరుగా బీజేపీ వైపు మళ్లేలా స్పష్టమైన రాజకీయ వైఖరి అవసరం. బీఆర్ఎస్ బలహీనపడుతున్న సమయంలో ఆ పార్టీకి చెందిన ఓటు బ్యాంకును ఆకర్షించడంలో బీజేపీ విఫలమైతే.. ఆ ఓట్లు కాంగ్రెస్ లేదా ఇతర రాజకీయ ప్రత్యామ్నాయాల వైపు మళ్లే అవకాశం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపైనే కన్ను**
తెలంగాణలో అధికారానికి చేరువ కావాలంటే బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో గణనీయమైన భాగాన్ని తనవైపు తిప్పుకోవడం బీజేపీకి కీలకం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లు, బీఆర్ఎస్‌కు గతంలో మద్దతిచ్చిన వర్గాలను ఆకర్షించేందుకు పక్కా వ్యూహం అవసరం. కేవలం హిందూత్వ అజెండా లేదా లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన విజయాలపై ఆధారపడకుండా.. స్థానిక సమస్యలపై నిరంతర ఉద్యమాలు నిర్వహించడం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడం ద్వారా రాజకీయ శూన్యతను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

**కాంగ్రెస్ పట్టు కూడా సవాలే**
అయితే బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బీజేపీ వైపు మళ్లించడం అంత సులభం కాదు. గ్రామీణ తెలంగాణలో కాంగ్రెస్ సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి రాజకీయ యంత్రాంగంతో బలంగా ఉంది. బీఆర్ఎస్ బలహీనపడుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. దీంతో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్-బీజేపీ మధ్య కాకుండా.. బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై ఆధిపత్యం కోసం మూడు పార్టీల మధ్య సాగుతున్న పోరుగా మారుతోంది.

**రెండేళ్లు.. కీలక సమయం**
రాబోయే రెండేళ్లు తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకంగా మారనున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయి రాజకీయాలను దాటి.. గ్రామం, మండలం, నియోజకవర్గం స్థాయిలో పార్టీ కమిటీలను బలోపేతం చేయాల్సి ఉంది. ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడంతో పాటు.. క్యాడర్‌కు స్పష్టమైన దిశానిర్దేశం చేసే ఏకీకృత నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్‌పై దూకుడైన ప్రతిపక్ష పాత్ర.. బీఆర్ఎస్ రాజకీయ శూన్యంపై పట్టు.. క్షేత్రస్థాయిలో పటిష్టమైన సంస్థాగత నిర్మాణం.. రాష్ట్రవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన నాయకత్వం—ఈ నాలుగు అంశాలపై బీజేపీ దృష్టి పెడితేనే తెలంగాణలో కమలం మరింత బలంగా వికసించే అవకాశం ఉంటుంది. లేకపోతే.. అవకాశం ఎదురుగానే ఉన్నా, దాన్ని అందుకోలేని పార్టీగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కో

**ముద్ర, భువనగిరి:**
బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలని కోరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు 'బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1.06 కోట్ల కార్డులు ఇచ్చాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీఆర్ఎస్ కార్యకర్తలకూ వాటిని అందిస్తున్నాం. వారి ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా?మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోలేదా?పేదలకు సహాయం చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా?' కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి 'సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు.. ఆడబిడ్డను చూసుకోవాలి. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. రేవంత్ ఉన్నంతకాలం.. బీఆర్ఎస్ అనే మొక్కను ఎదగనివ్వం. తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్కను పీకుతాం. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలుస్తుంది. నెలాఖరుకు సిరిసిల్ల వెళ్తాం. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తాం. బావ బావమరుదులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. వచ్చే ఎన్నికల నాటికి సీట్లు పెరిగితే 117, ప్రస్తుతం ఉన్నవే కొనసాగితే 90తో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం' అని రేవంత్ సవాల్ విసిరారు.

# రెండేళ్లు ఓపిక పట్టండి

**ముద్ర, హైదరాబాద్:**
వచ్చే రెండేళ్లు సహకరిస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కొడంగల్ ప్రభుత్వ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు రెండేళ్లు సమయం ఇస్తే.. ఇంక్రిమెంట్లు, పీఆర్సీ సహ ఉపాధ్యాయుల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. మాట తప్పితే వచ్చే ఎన్నికలలో తనకు మార్కులు వేసే నిర్ణయం కూడా ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని గుర్తు చేశారు. రెండు సంవత్సరాలు సహకరిస్తే.. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రెండేళ్లు వెసలుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఆర్థిక వెసులుబాటును అనుసరించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
రెండు సంవత్సరాలు సహకరిస్తే.. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రెండేళ్లు వెసలుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఆర్థిక వెసులుబాటును అనుసరించి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులే వీధుల్లోకి వస్తే ప్రభుత్వానికి మంచిది కాదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వారే ధర్నాలు చేస్తామంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని అభిప్రాయపడ్డారు. అందుకే ముఖ్యమంత్రిగా రెండేళ్లు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.
గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్న రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయంటే ఆ గొప్పతనం ఉపాధ్యాయులదేనని కొనియాడారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి వివాదం లేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేశామని.. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్ నియమించి ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో స్కిల్స్ నేర్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని.. కార్పొరేట్ కంపెనీల సమన్వయంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలను ప్రారంభించినట్లు సీఎం వివరించారు.





# ఈ చిట్టినాయుడు ఓ లెక్కనే కాదు

**ముద్ర, కరీంనగర్:**
ఒక్కరిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ ప్రభుత్వమే బర్తరఫ్ కానుందంటూ రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ యువ సమరభేరిలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికిచ్చి కొడుతున్నారంటూ ధ్వజమెత్తారు. ''రాహుల్ గాంధీ, ఎక్కడున్నావు.. హైదరాబాద్‌కు ఎందుకు రావు'' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.
రేవంత్‌రెడ్డి రెన్యూవల్ సీఎం.. జాబ్ క్యాలెండర్.. చిత్తు కాగితం కంటే హీనమని తేలిపోయింది. వెయ్యి రోజులయ్యాయి. యూత్ డిక్లరేషన్ గురించి అడిగితే బూతులు వినిపిస్తున్నాయి. మంత్రులు, ముఖ్యమంత్రి వాటాలు, కమీషన్ల కోసం తన్నుకుంటున్నారు. వీళ్లకు తిక్క ఉంది.. కానీ లెక్కలేదు. నోటిఫికేషన్లు లేవు.. లూటిఫికేషన్లు మాత్రం జరుగుతున్నాయి. నిరుద్యోగులు నిప్పు కణికలే మండాలి.. మళ్లీ పుడతామా ఏంటి?'' అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.
కేసీఆర్ రాజీనామా చేయాలా?. ధోకేబాజ్ రేవంత్ చేయాలా?. కేసీఆర్‌తో పెట్టుకుంటే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిపోతుంది. ఫోర్ ట్వంటీ హామీలిచ్చిన మీరే 420 సార్లు హామీలు చేయాలి. మంత్రులు, ముఖ్యమంత్రి కొట్లాడుకుంటున్నారు. మీకు దండం పెట్టినోళ్లే.. రేపు పిండాలు పెడతారు. రాహుల్ గాంధీ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్నాడు.. అవుతల పడ్డాడు. సీల్ కవర్‌లో పంపిన మీ సీఎం ఏం చేస్తుండో నీకు సోయి ఉందా రాహూల్ ?. నెలకోసారి మూటలు తీసుకుని రాహూల్ గాంధీ నోరు మూసుకుని కూర్చుంటుండు'' అంటూ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు.



# 'అసెంబ్లీ' తర్వాతే విస్తరణ...?!

**ముద్ర, హైదరాబాద్:**
కొండా సురేఖ బర్తరఫ్ తో ఖాళీ అయిన స్థానంతో పాటు కేబినెట్ లో ఖాళీగా ఉన్న మరో స్థానాలను భర్తీ చేసేందుకు రేవంత్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు ముందుగానే కేబినెట్ విస్తరణ జరగనుందని పొలిటికల్ సర్కిల్స్ లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కేబినెట్ విస్తరణపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం (సెప్టెంబర్ 5) మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేదని స్పష్టం చేశారు. ఇటీవల ఢిల్లీలో కేవలం కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని తెలిపారు. కేబినెట్ విస్తరణపై హైకమాండ్ తో ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది పూర్తిగా సీఎం రేవంత్ ఇష్టమని పేర్కొన్నారు. ఇక, తనకు మంత్రి పదవి రాబోతుందంటూ జరుగుతోన్న ప్రచారంపైన మహేష్ గౌడ్ వివరణ ఇచ్చారు. తనకు మంత్రి పదవి వస్తుందనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనని కొట్టిపారేశారు. మహేష్ గౌడ్ వ్యాఖ్యలతో కేబినెట్ విస్తరణపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. అసెంబ్లీ సమావేశాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ అనే విషయం స్పష్టమైంది.

**కొండా బర్తరఫ్ హైకమాండ్ నిర్ణయం:**
మాజీ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ పైన మహేష్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ బర్తరఫ్ పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని తెలిపారు. ఆమెను కాపాడేందుకు తమ వంతుగా తీవ్రంగా ప్రయత్నించామన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ ఏమాత్రం అంగీకరించలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగే విధంగా వ్యవహరించడం వల్లే కొండా సురేఖపై అధిష్టానం చర్యలు తీసుకున్నదని అన్నారు. కొండాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని తెలిపారు. ఈ విషయంలో తమ చేతిలో ఏమీ లేదని, గతంలో రెండు సార్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు సీఎంతో మాట్లాడినట్లు గుర్తు చేశారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో కులాలు, మతాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. క్రమశిక్షణ సంఘం ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కొండా సురేఖ, చిన్నారెడ్డిపై అధిష్టానం చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఇకపై ఎవరూ క్రమశిక్షణ ఉల్లంఘించినా ఇదే రీతిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
బర్తరఫ్ తర్వాత కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో మాట్లాడారన్నారు. ఇకపై ఆ విధంగా మాట్లాడొద్దని సూచించారు. పార్టీలో ఏదైనా సమస్య ఉంటే.. పీసీసీ, జనరల్ సెక్రటరీ, రాహుల్ గాంధీతో కూడా మాట్లాడవచ్చన్నారు. బహిరంగ వేదికలపై విమర్శలు చేయవద్దని, వాటిని కాంగ్రెస్ పార్టీ అనుమతించదన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని నమ్ముకున్న పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 6.09.2026
www.mudranews.in | @mudranews



## బరువు తగ్గినా కొవ్వే తగ్గుతుందని అనుకోవద్దు

వేగంగా బరువు తగినప్పుడు శరీరంలోని కొవ్వుతో పాటు కండరాల ద్రవ్యరాశి కూడా తగ్గే అవకాశం ఉంది. అందుకే కేవలం తక్కువ సమయంలో తూకం తగ్గడాన్ని విజయంగా చూడకూడదు.



# పాక్ సైన్యంపై బలోచ్ ఆర్మీ మెరుపుదాడి..

**25 మంది సైనికులు హతం..**
**పాకిస్తాన్ సైన్యానికి చుక్కలు చూపిస్తున్న బీఎల్ఏ..**
**బలూచ్ రెబల్స్ జరిపిన దాడుల్లో 25 మంది జవాన్లు హతం..**

**ముద్ర డెస్క్** : పాకిస్తాన్ సైన్యానికి బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(BLA) చుక్కలు చూపిస్తోంది. రెండు వేర్వేరు దాడుల్లో 25 మంది పాక్ సైనికుల్ని హతమార్చినట్లు చెప్పింది. బీఎల్ఏ దెబ్బకు పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. బలూచిస్తాన్‌లో డ్యూటీ అంటేనే వెళ్లేందుకు పాక్ సైనికులు భయపడుతున్నారు. వీలైతే సెలవు, కాదంటే రిజైన్ చేస్తున్నారు. తాజా దాడికి సంబంధించి బీఎల్ఏ ఒక వీడియోను రిలీజ్ చేసింది. పాకిస్తాన్ సైనికుల ట్రక్కును సినిమా తరహాలో దాడి చేసింది. జియారత్ క్రాస్ వద్ద తమ 'ఫతే స్క్వాడ్' యోధులు సైనిక కాన్వాయ్‌పై మెరుపుదాడి చేసి రెండు వాహనాలను ధ్వంసం చేశారని శుక్రవారం బీఎల్ఏ ప్రకటించింది. ఈ దాడిలో 18 మంది పాకిస్తానీ సైనికులు మరణించారని బీఎల్ఏ పేర్కొంది. మరో ఐదుగురు పాకిస్తానీ సైనికులు తప్పించుకునే క్రమంలో గాయపడ్డారని తెలిపింది.

బీఎల్ఏ అధికారిక మీడియా హక్కల్ మంటల్లో కాలిపోతున్న పాక్ సైనిక వాహనాన్ని చూపించింది. ప్రస్తుతం ఈ వీడియోలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు, పాకిస్తాన్ సైన్యం మరణించిన జవాన్లను శవపేటికల్లో ఉంచి, ప్రార్థనలు చేస్తున్న వీడియో కూడా వైరల్ అవుతోంది. ఫతే స్క్వాడ్ బీఎల్ఏలో స్పెషల్ పోరాట దళంగా పనిచేస్తోంది. కొండలతో కూడి ఉన్న బలూచిస్తాన్‌లో గెరిల్లా యుద్ధం, ఆకస్మిక దాడులకు పేరుపొందింది. 2025 మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్ చేసింది కూడా ఈ దళమే.



సురబ్‌లోని హాజికాలో జరిగిన మరో దాడిలో తమ STOS యూనిట్ (స్పెషల్ టాక్టికల్ ఆపరేషన్స్ స్క్వాడ్) రిమోట్ కంట్రోల్ వాహనాన్ని ఉపయోగించి పేలుడు జరిపిందని, ఈ దాడిలో ఏడుగురు పాకిస్తానీ సైనికులు మరణించారని BLA ప్రకటించింది. అయితే, పాక్ ఆర్మీ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి మృతుల సంఖ్యను చెప్పలేదు. గత కొన్ని నెలల్లో పాక్ సైన్యంపై మొత్తం 36 ఆపరేషన్లు చేపట్టి 33 మందికి పైగా సైనికుల్ని హతమార్చినట్లు బీఎల్ఏ చెప్పింది.

ఇదిలా ఉంటే, బీఎల్ఏపై ప్రతీకారం తీర్చుకున్నట్లు పాక్ సైన్యం చెప్పింది. గత 72 గంటల్లో బలూచిస్తాన్‌లోని మస్తుంగ్, సిబి, క్వెట్టా, కలాత్ జిల్లాలో మిలిటెంట్ల స్థావరాలపై జరిపిన దాడుల్లో 48 మంది మిలిటెంట్లను హతమార్చినట్లు చెప్పింది. హతమైన వారిలో నిషేధిత బీఎల్ఏ, తెహ్రీక్ ఏ తాలిబాన్(టీటీపీ)కి చెందిన వారు ఉన్నారని ప్రకటించింది.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

**ముద్ర, తిరుమల:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు. తిరుమల నాలుగు మాడ వీధులతో పాటు ఇతర ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధ్వజారోహణం సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు, బ్యారికేడింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. గరుడసేవకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ట్రాఫిక్, పార్కింగ్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు పలు భాషల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, ఫైర్, ఫారెస్టు, ఇంటెలిజెన్స్, ఆర్టీసీ, రైల్వే శాఖల సమన్వయంతో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

## ఉన్నత విద్యలో సంస్కరణలు, పరిశోధనలకు ప్రాధాన్యం



**ముద్ర, హైదరాబాద్,** సెప్టెంబర్ 5: ఉన్నత విద్యారంగంలో మార్పులకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు నిరంతరం సంస్కరణలు చేపట్టి, పరిశోధన, ఆవిష్కరణలు, జ్ఞాన సృష్టికి ప్రాధాన్యమివ్వాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యామండలి (TGCHE) ప్రచురించిన 'తెలంగాణ జర్నల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్' (TJHE) వాల్యూమ్–2, సంచిక–1ను గవర్నర్ విడుదల చేశారు. 'Universities in the Twenty-First Century: Renewal, Reforms and Roadmaps' ఇతివృత్తంతో వెలువడిన ఈ జర్నల్ ఉన్నత విద్యపై పరిశోధనాత్మక చర్చలకు దోహదపడుతుందని అన్నారు. అంతరశాఖా విద్య, పరిశోధన–ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని సూచించారు. సెప్టెంబర్ 26న హైదరాబాద్‌లో జరగనున్న REACH–2026 సదస్సు వివరాలను TGCHE ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో TGCHE కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. అంతకుముందు పలువురు విద్యా, వైద్య రంగ ప్రముఖులు గవర్నర్‌ను లోక్‌భవన్‌లో కలిశారు.

## ఆరోగ్యవంతమైన ప్రజలతోనే వికసిత్ భారత్




**ముద్ర, హైదరాబాద్:** ఆరోగ్యవంతమైన ప్రజలతోనే అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించగలమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఫిట్‌నెస్, క్రీడలు, మహిళలు, పిల్లల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఏ.వి. కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) నిర్వహించిన ఐదు రోజుల జాతీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, నడక, యోగా, తగినంత నిద్రను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. నూనె, చక్కెర, జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ఫిట్ ఇండియా', 'డ్రగ్ ఫ్రీ ఇండియా', 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మార్చాలని అన్నారు.

శ్రీ సామ జగన్మోహన్ రెడ్డి, ఏ.వి. ఎడ్యుకేషన్ బోర్డు సభ్యులు శ్రీ కె. వినోద్ రెడ్డి, ఏ.వి. కాలేజ్ కరస్పాండెంట్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, సిబ్బంది, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేవంత్ సర్కార్‌ను గద్దె దించే వరకు విశ్రమించం

**- ఈటల రాజేందర్**




**ముద్ర, హైదరాబాద్:** భూభారతి చట్టం, సెక్షన్ 22–ఏ నిషేధిత జాబితాలో పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజల భూములను చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పేదల గోడు పట్టించుకోకుండా ఇళ్ల కూల్చివేతలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పేదల ఇళ్లు, భూములను సెక్షన్ 22–ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చే అధికారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్‌ను గద్దె దించే వరకు, ఆ ప్రభుత్వాన్ని బొంద పెట్టే వరకు విశ్రమించబోమని శపథం చేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 22–ఏ నిషేధిత జాబితాలో రైతుల భూములను చేర్చడం వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యల కంటే రియల్ ఎస్టేట్‌పై ఎక్కువ దృష్టి పెడుతోందని ఆరోపించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సైతం 22–ఏ నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది రైతులు, భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నందున వివాదాస్పద నిబంధనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమములో ఎంపీలు డాక్టర్ కె లక్ష్మణ్, డీకే అరుణ , కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కె.వెంకటరమణా రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.18,250 కోట్ల ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ప్రణాళిక



**ముద్ర, హైదరాబాద్,** సెప్టెంబర్ 5: వానాకాలం సీజన్‌లో రూ.18,250 కోట్ల అంచనా విలువతో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించకుండా, ధాన్యం విక్రయించిన వెంటనే సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 1 నాటికి 8,283 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ఇందులో 3,180 ఐకేపీ, 4,372 పీఏసీఎస్, 731 ఇతర కేంద్రాలు ఉంటాయని చెప్పారు. అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో గోదాములు, గన్నీ సంచులు, రవాణా వాహనాలు, హమాలీలు, తూకం, నాణ్యత పరీక్ష పరికరాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.ఏడు ప్రాధాన్య సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048, కేఎన్ఎం–1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ–సోనా, డబ్ల్యూజీఎల్–44, కేఎన్ఎం –7715 రకాలకు ఈ బోనస్ వర్తిస్తుందని తెలిపారు. తెలంగాణ బియ్యానికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ, రైతుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ధాన్యం తరలింపు, చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంచాలకుడు శ్యామ్ ప్రసాద్, రోహిత్ సింగ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు యోగి ఆదిత్యనాథ్



**ముద్ర, నెల్లూరు,** సెప్టెంబర్ 5: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనుంది. సెప్టెంబర్ 7న జరిగే ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.సోమవారం ఉదయం వెంకటాచలం చేరుకోనున్న యోగి ఆదిత్యనాథ్.. అక్షర విద్యాలయం, సోమా నైపుణ్య కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో జరిగే రజతోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తదితర ప్రముఖులు ఈ వేడుకలకు హాజరుకానున్నారు.2001లో గ్రామీణ యువత, మహిళలు, రైతులకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కల్పించాలనే లక్ష్యంతో స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటైంది. వెంకటాచలంతో ప్రారంభమైన సేవలు ప్రస్తుతం ఆత్కూర్, ముచ్చింతల్ కేంద్రాల ద్వారా విస్తరించాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతకు ఉచిత వసతి, నైపుణ్య శిక్షణ అందిస్తూ వారిని స్వయం ఉపాధి దిశగా తీర్చిదిద్దుతోంది.అలాగే పేదలకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తూ ట్రస్ట్ సామాజిక సేవల్లోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ, విదేశీ నిధులపై ఆధారపడకుండా సేవాభావం కలిగిన దాతలు, మిత్రుల సహకారంతో 25 ఏళ్లుగా సంస్థ తన సేవలను కొనసాగిస్తోంది. రజతోత్సవాల సందర్భంగా ప్రజలను పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ట్రస్ట్ నిర్వాహకులు ఆహ్వానించారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై వేగంగా విచారణ

**ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**ముద్ర, అమరావతి** : ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసులను వేగంగా విచారించి, తప్పు చేసిన వారికి త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక కోర్టుల ద్వారా త్వరగా పరిష్కరించాలని సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, బాధితులకు న్యాయం జరిగేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. గుంటూరు, అనంతపురం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో అధికంగా నమోదైన కేసులపై ప్రత్యేక అధ్యయనం చేయాలని ఆదేశించారు. కేసుల స్వభావం, కారణాలు, పరిష్కారానికి పడుతున్న సమయం వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు. బాధితులకు పరిహారంతో పాటు ఇళ్ల వంటి ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు త్వరగా అందేలా చూడాలన్నారు.

జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న 131 సమావేశాలను వెంటనే నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన చంద్రబాబు, ఎస్సీ, ఎస్టీల ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులను ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రవేశాలు పొందే స్థాయికి తీర్చిదిద్దాలని అన్నారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ, అటవీ ఉత్పత్తుల ద్వారా గిరిజనుల ఆదాయాన్ని పెంచే అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. అవకాశాలు లేక వెనుకబాటుతనం కాదని, అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, మౌలిక వసతులతో పాటు నెట్‌జీరో విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి దేశంతో పాటు విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

# ఖమ్మం మంత్రుల 'పోర్ట్‌ఫోలియో' లో పెనుమార్పులు?

**అధిష్ఠానం వ్యూహం.. నేతల అంతర్మథనం..**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం** : ఉమ్మడి ఖమ్మంలో రాజకీయం హీటెక్కుతోంది! తెలంగాణ రాజకీయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాధాన్యం ఎప్పుడూ ప్రత్యేకం. రాష్ట్ర కేబినెట్‌లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ జిల్లా నేతల చుట్టూ ఇప్పుడు మళ్లీ రాజకీయ చర్చ ముమ్మరమైంది. కొండా సురేఖ ఎపిసోడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో, అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణతో పాటు శాఖల మార్పు పై దృష్టి సారించారనే వార్తలు ఖమ్మం రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి.

జిల్లా కు చెందిన ముగ్గురు 'హేమాహేమీల్లో ఇద్దరి పోర్ట్‌ఫోలియోలు మారతాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర కేబినెట్‌లో కీలక భూమిక పోషిస్తున్న జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల శాఖల మార్పుపై అధిష్ఠానం తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు వెలువడుతున్న వార్తలు రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖలను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చుట్టూనే ప్రస్తుతం అంతా తిరుగుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుండి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఈ మంత్రులపై ఇటీవల కాలంలో కొన్ని వివాదాస్పద ఆరోపణలు రావడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మంత్రులపై వచ్చిన ఆరోపణలను ఎత్తిచూపుతూ ప్రతిపక్షాలు విమర్శనాత్మక వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వీధిపోరాటాలు, ఆందోళనలకు దిగడం వల్ల ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. రాబోయే రోజుల్లో ఈ వివాదాలు మరింత ముదిరితే, అది సమగ్ర పాలనపై ప్రభావం చూపడమే కాకుండా, పార్టీ ఇమేజ్‌ను కూడా దెబ్బతీస్తుందనే ఆందోళన అధిష్ఠానంలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ముగ్గురు కీలక నేతల్లో కనీసం ఇద్దరి శాఖలు మారే అవకాశం ఉందనే ప్రచారం గులాబీ, బిజేపి, కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర స్థాయిలో సాగుతోంది. ఒక మంత్రి విషయంలో మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానమే జోక్యం చేసుకుని, సదరు నేత శాఖను మార్చాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి స్పష్టమైన సూచనలు చేసినట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పట్టు సాధించేందుకు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయా? లేక ప్రభుత్వ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు అధిష్ఠానం ఈ తరహా సర్జరీకి పూనుకుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఆశావహుల ఒత్తిళ్లు, మరోవైపు సీనియర్ల సమీకరణలు... మొత్తానికి ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 'పొలిటికల్ హీట్'ను ఒక్కసారిగా పెంచేసింది.

రాబోయే కొద్ది రోజుల్లో అధిష్ఠానం నుంచి వచ్చే స్పష్టత ఆధారంగా జిల్లా మంత్రుల రాజకీయ భవిష్యత్తు, శాఖల పరిధి ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి!

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 06.09.2026
4
వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## మెట్లు ఎక్కగానే ఆయాసమా?



ఆవలింతలకు, గుండె సమస్యలకు ప్రత్యక్ష సంబంధం ఉందని కొందరు చెబుతున్నప్పటికీ.. కేవలం ఆవలింతలు రావడాన్ని గుండెపోటుకు లక్షణంగా పరిగణించేందుకు ప్రస్తుతం బలమైన వైద్య ఆధారాలు లేవు. అయితే ఆవలింతలతో పాటు కొన్ని అసాధారణ లక్షణాలు కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

**అసలు ఆవలింత ఎందుకు వస్తుంది?**

ఆవలింత ఎందుకు వస్తుందనే దానిపై పూర్తిస్థాయి స్పష్టత లేదు. సాధారణంగా నిద్ర, మెలకువ మధ్య మారే సమయంలో, అలసట, విసుగు లేదా మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో కూడా ఆవలింతలకు కొంత పాత్ర ఉండవచ్చని సూచనలు ఉన్నాయి. అయితే ఆవలింతకు ఒకే ఒక్క కారణం ఉందని చెప్పలేం.

**గుండె సమస్యలకు సంబంధం ఉందా?**

కేవలం ఆవలింతలు రావడం గుండెపోటుకు సాధారణ లక్షణం కాదు. అందువల్ల తరచుగా ఆవలిస్తున్నంత మాత్రాన గుండె సమస్య ఉందని భయపడాల్సిన అవసరం లేదు. అయితే ఆవలింతలతో పాటు ఛాతీలో నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, విపరీతంగా చెమటలు పట్టడం, వికారం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్తగా ఉండాలి. అలాగే దవడ, మెడ, భుజం లేదా చేతుల్లో నొప్పి వంటి లక్షణాలు కూడా ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యం.

**ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి?**

రాత్రి తగినంత నిద్రపోయినప్పటికీ పగటిపూట నిరంతరం ఆవలింతలు వస్తుంటే లేదా అధికంగా నిద్రమత్తుగా, అలసటగా అనిపిస్తుంటే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా అధిక ఆవలింతలతో పాటు ఛాతీ నొప్పి, ఆయాసం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే స్వయంగా కారణాన్ని ఊహించకుండా వైద్యుల సలహా తీసుకోవాలి.

**ఆవలింతలు ఎక్కువగా వస్తే ఏం చేయాలి?**

ప్రతిరోజూ తగినంత నిద్ర పొందుతున్నారా అనేది గమనించండి. శారీరక అలసట, మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉందో పరిశీలించండి. ఇటీవల కొత్తగా ఏదైనా మందులు ప్రారంభించారా అనేది గమనించండి. పగటిపూట అధిక నిద్రమత్తు ఉంటే వైద్యుడిని సంప్రదించండి. ఆవలింతలతో పాటు ఛాతీ నొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందండి.



## ఉదయం పూట ఇది తినాలి!

రోజు ఒక గుడ్డు, బనానా, యాపిల్ తినడం చాలా మంచిది అని చాలా సార్లు వినే ఉంటారు కదా. నిజమే ఇవి రోజు తినాలి. మరీ ముఖ్యంగా గుడ్డు తినడం వల్ల కూడా మరింత ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. మీ డైలీ లైఫ్ లో ఒక గుడ్డును తినడం కచ్చితంగా చేసుకోండి. ఎందుకంటే ఇందులో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. ఈ గుడ్లు ఇతర విధాలుగా కూడా మీకు ప్రయోజనాలను అందిస్తాయి. అయితే అల్పాహారం తినడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. శరీరానికి శక్తి కూడా లభిస్తుంది. దీన్ని ప్రతిరోజూ తింటే శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం. మీరు ఎగ్ లవర్స్ అయితే కచ్చితంగా తెలుసుకుంటారు. కాకపోయినా సరే ఈ ప్రయోజనాలను తెలుసుకొని మరీ తినండి. దీన్ని బ్రేక్ ఫాస్ట్ గా తీసుకోవాలి అని మర్చిపోవద్దు. సరే ఇక స్టార్ట్ చేద్దామా? గుడ్లు కొందరికి నచ్చవు. కానీ కొందరికి చాలా రుచికరంగా అనిపిస్తుంది తెలుసా? ఇవి చాలా పోషకమైనవి కూడా. ప్రోటీన్, విటమిన్లు, పోషకాహారం, కొవ్వు వంటి అనేక ముఖ్యమైన పోషకాల నిధి ఈ గుడ్డు. వాటిని సూపర్ ఫుడ్స్ అనడంలో తప్పు లేదు. వీటి వల్ల ముఖ్యమైన పోషకాల లోపాన్ని తీర్చుకోవచ్చు అంటున్నారు నిపుణులు.



**గుడ్లు పోషకాలకు నిలయం**

ప్రోటీన్: గుడ్లు అధిక-నాణ్యత ప్రోటీన్ గొప్ప మూలం. ఇది కండరాలను నిర్మించడంలో, మరమ్మత్తు చేయడంలో సహాయపడుతుంది.

విటమిన్లు: గుడ్లలో విటమిన్ బి12, విటమిన్ డీ, విటమిన్ ఏ, విటమిన్ బీ5 వంటి అనేక విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి.

పోషకాహారం: గుడ్లలో సెలీనియం, భాస్వరం, జింక్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవి శరీరం బాగా పనిచేయడానికి అవసరం.

ఆరోగ్యకరమైన కొవ్వు: గుడ్లలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు కనిపిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

**రోజూ గుడ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు**

గుండె ఆరోగ్యం: గుడ్లలో లభించే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, గుడ్లలో లభించే కోలిన్ అనే పోషకం కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

మెదడు ఆరోగ్యం: గుడ్లలో లభించే కోలిన్ మెదడు అభివృద్ధికి, సరైన పనితీరుకు చాలా అవసరం. ఇది అల్జీమర్స్ వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

బరువు నిర్వహణ: గుడ్లలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. వాటిని తినడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. ఆకలి కూడా తగ్గుతుంది. అందుకే ప్రతిరోజూ గుడ్లు తినండి. బరువు కూడా తగ్గుతారు.

కంటి ప్రయోజనాలు: గుడ్లలో విటమిన్ ఎ ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది రాత్రి అంధత్వం వంటి కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

కండరాల నిర్మాణం: గుడ్లలో లభించే అధిక ప్రోటీన్ కండరాలను నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అథ్లెట్లు, వ్యాయామం చేసేవారికి అవసరమైన ఆహార పదార్థం.

**ప్రతికూలతలు కూడా ఉండవచ్చు.**

అయితే ఈ గుడ్ల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ గుడ్లు తినడం కొంత మందికి హానికరం కావచ్చు. అందుకే ప్రతిరోజూ 1-2 గుడ్లు మాత్రమే తినండి. లేకుంటే మీరు కొన్ని దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి రావచ్చు. రోజూ గుడ్లు తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి మంచిది కాదు. రోజువారీ ఆహారంలో గుడ్లు చేర్చుకోవడం వల్ల కూడా చాలా మందికి అలెర్జీలు వస్తాయి.

## వర్షాకాలం కారు ప్రయాణం
### ఈ టిప్స్ పాటించండి



దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. ఎంత వర్షాలు వచ్చినా, ఎండలు ఉన్నా, చలి ఉన్నా సరే పనులకు వెళ్లడం మాత్రం తప్పదు. కదా. ఇక ఈ సమయంలో వర్షంలో తడవకుండా ఉండటానికి చాలా మంది కారులను ఉపయోగిస్తారు. కారు డ్రైవింగ్ కే లైక్ కొడతారు. అంతే కాదు కొంత మంది వర్షాకాలంలో కొండ ప్రాంతాల్లో కూడా ప్రయాణించడానికి బయల్దేరుతారు. కానీ మార్గ మధ్యలో ఎక్కడో వర్షం పడటం ప్రారంభిస్తే, మీ కారు చిక్కుకుపోయే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఈ సీజన్‌లో వాహనాన్ని నడపడం అంత ఈజీ కాదు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు చాలా ఇబ్బందులను ఎదుర్కోవలసి రావచ్చు. ఈ సీజన్‌లో దృశ్యమానత కూడా తగ్గుతుంది. అందుకే చాలా జాగ్రత్తగా కారు డ్రైవింగ్ చేయాల్సి ఉంటుంది. మరి ఈ సమయంలో ఎలాంటి టిప్స్ ను గుర్తు పెట్టుకోవాలంటే?

వర్షాకాలంలో రోడ్లు జారుడుగా మారుతాయి. అటువంటి పరిస్థితిలో, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఈ సమస్యను నివారించడానికి ఈ రోజు మేము మీకు కొన్ని చిట్కాలను చెబుతున్నాము. వీటిని ఉపయోగిస్తే మీరు వర్షాకాలంలో కూడా కారును సులభంగా నడపవచ్చు. వర్షం పడినప్పుడు, కారు కిటికీలు మూసి ఉంటాయి. దీని కారణంగా కారు విండ్‌స్క్రీన్ పొగమంచుగా మారుతుంది. ముందు భాగం సరిగ్గా కనిపించదు. ఈ సమస్యను నివారించడానికి, డీఫాగర్, ACని ఉపయోగించాలి. దీనితో పాటు, వైపర్‌ను కూడా ఆన్‌లో ఉంచాలి. కారు విండ్‌స్క్రీన్‌ను లోపలి నుంచి తుడవకూడదు. విండో గ్లాస్‌పై పొగమంచు ఉంటే, విండోను కిందికి తిప్పి శుభ్రం చేయండి.

**లైట్లను ఉపయోగించండి**

కార్ లైట్లు కూడా కొన్నిసార్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. మీ కారులో డేటైమ్ రన్నింగ్ లైట్లు (DRL) ఉంటే, వర్షం సమయంలో వాటిని ఉపయోగించండి. దీనివల్ల ఇతరులు మీ కారును దూరం నుంచి చూసే అవకాశం ఉంటుంది. రాత్రిపూట హై బీమ్ ఉపయోగించవద్దు.

**మీ లేన్ లో డ్రైవ్ చేయండి**

వర్షాకాలంలో సురక్షితంగా ఉండటానికి ఉత్తమ మార్గం మీ స్వంత లేన్‌లో నడపడం. ముందు నుంచి వస్తున్న వాహనాన్ని మీరు చూడరు. ఇలాంటి పరిస్థితిలో ఏదైనా ప్రమాదం అకస్మాత్తుగా జరగవచ్చు. కాబట్టి మీ సొంత లేన్‌లో నడపడానికి ప్రయత్నించాలి.

**వేగం**

ఎక్కడికైనా త్వరగా చేరుకోవడానికి ఎప్పుడూ అధిక వేగంతో డ్రైవ్ చేయకండి. వర్షాకాలంలో, రోడ్డు తడిగా ఉంటుంది. మీరు అకస్మాత్తుగా బ్రేకులు వేస్తే వాహనం జారిపోయే ప్రమాదం ఉంది.

**నీటి ఎద్దడి**

నీటిలో మునిగిపోయిన రోడ్డుపై ప్రయాణించకుండా ఉండండి. రోడ్డుపై నీరు ఉంటే చాలా మంది అలాగే వెళ్లడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ జాగ్రత్త. ఏదైనా గుంతలు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిలో నీటి లోతును అంచనా వేయడం చాలా కష్టం. ఈ రోడ్లపై మీ వాహనం ఆగి చెడిపోవచ్చు. అలాంటి పరిస్థితిలో, వేరే మార్గాన్ని ఎంచుకోవడం మంచిది.

## రైళ్లలో 3A, 3E, AC ల మధ్య తేడా!



భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద రైలు నెట్‌వర్క్. భారతీయ రైల్వేల సరసమైన టిక్కెట్ల కారణంగా, ప్రతిరోజూ లక్షలాది మంది రైలులో ప్రయాణిస్తారు. మీరు రైలులో ప్రయాణించి ఉంటే, జనరల్, స్లీపర్‌తో పాటు అనేక వర్గాల్లో AC కోచ్‌లు ఉంటాయి. ఇవి మీరు కచ్చితంగా గమనించే ఉంటారు. ప్రయాణించి కూడా ఉంటారు. మరి ఈ AC కోచ్‌ల మధ్య తేడా ఏమిటో మీకు తెలుసా? ఈ రోజు మనం 3AC కోచ్, 3E కోచ్ మధ్య తేడా ఏమిటో తెలుసుకుందామా బాస్?

**రైల్వే లైఫ్ లైన్**

భారత రైల్వేలను దేశానికి జీవనాడి అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ప్రతిరోజూ లక్షలాది మంది రైల్వేల ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి ప్రయాణిస్తారు. కానీ భారతదేశంలో ప్రతిరోజూ దాదాపు 13,523 ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. అంతేకాదు దేశంలో ప్రతిరోజూ 9146 గూడ్స్ రైళ్లు నడుస్తున్నాయి అని మీకు తెలుసా? అంటే దీని ప్రకారం, భారతదేశంలో రోజుకు మొత్తం 22,669 రైళ్లు నడుస్తున్నాయి అన్నమాట.

**3A అంటే థర్డ్ AC, 3E అంటే థర్డ్ AC ఎకానమీ**

మీరు రైలులో ప్రయాణించినట్లయితే, ఆ రైలులో జనరల్, స్లీపర్, AC కోచ్‌లు ఉంటాయనే విషయం మీరు గమనించి ఉంటారు. ముఖ్యంగా వేసవిలో, AC కోచ్‌లలో ప్రయాణించడం సులభం కాబట్టి చాలా మంది ACలో ప్రయాణించడానికి ఇష్టపడతారు. చాలా మంది ప్రయాణీకులు థర్డ్ ACలో ప్రయాణించడానికి ఇష్టపడతారు. ఎందుకంటే దాని టికెట్ కూడా కాస్త తక్కువగా ఉంటుంది. కానీ గత కొన్ని సంవత్సరాలుగా, రైల్వేలు థర్డ్ ACతో పాటు థర్డ్ E కోచ్‌ను కూడా యాడ్ చేశారు. ఇది థర్డ్ AC లాగా కనిపిస్తుంది. అయితే దాని టికెట్ మాత్రం కొంచెం చౌకగా ఉంటుంది. సీటు కొంచెం ఇరుకైనది.

**3E కోచ్ - 3A కోచ్ మధ్య వ్యత్యాసం**

భారతీయ రైల్వేలు ఇప్పుడు ప్రయాణీకులకు సరసమైన ధరలకు AC కోచ్‌లో ప్రయాణించడానికి 3E కోచ్ ఎంపికను అందిస్తున్నారు. దీనిని థర్డ్ AC ఎకానమీ అంటే 3E కోచ్ అంటారు. ఈ కోచ్ థర్డ్ AC అంటే 3A లాగానే ఉంటుంది.

అయితే 3E కోచ్ ఛార్జీ 3A కంటే తక్కువ. 3E కోచ్‌లో, ప్రతి సీటులోని ప్రయాణీకుల కోసం విడిగా AC డక్ట్ ఏర్పాటు చేసి ఉంటుంది. ప్రతి సీటుకు బాటిల్ స్టాండ్, ప్రతి సీటుకు రీడింగ్ లైట్, ప్రతి సీటుకు ఛార్జింగ్ సౌకర్యం ఉంటుంది. 3A కోచ్ లాగానే 3E కోచ్‌లో బెడ్ షీట్లు, షీట్లు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ రెండింటి మధ్య ఉన్న ఏకైక తేడా ఏమిటంటే 3A కోచ్‌లో 72 సీట్లు ఉంటాయి. అయితే 3E కోచ్‌లో దీని కంటే 11 సీట్లు ఎక్కువ. అంటే 83 సీట్లు ఉంటాయి.

## ఎవరి పెళ్లికి వెళ్లాలి?

భారతదేశ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే కొన్ని కార్యక్రమాలకు అతిథులను పిలవడం ఆనవాయితీ. వీటిలో వివాహ కార్యక్రమానికి తమకు తెలిసి ఉన్న బంధువులు, మిత్రులు, తోటి ఉద్యోగులు, చుట్టుపక్కల వారిని పిలుస్తూ ఉంటారు. అయితే ఇలా వచ్చిన వారిని కొందరు సాదరంగా ఆహ్వానిస్తే.. మరి కొందరు పట్టనట్లు వ్యవహరిస్తుంటారు.

ఇలాంటి అప్పుడు వారి పెళ్లికి ఎందుకు వెళ్ళామా? అన్న భావన కలిగిస్తుంది. అయితే ఈ కార్యక్రమానికి వెళ్లేముందే ఒక నిర్ణయానికి రావాలని కొందరు అంటున్నారు. దీనిని బట్టి చూస్తే ఎవరి పెళ్లికి వెళ్లాలి? ఎవరి శుభకార్యానికి పిలిచినా వెళ్లకుండా ఉండాలి? అనే దానిపై ఆసక్తిగా చర్చ సాగుతుంది. దీని గురించి వివరాల్లోకి వెళ్తే..

తనతోపాటు పనిచేసే ఒక వ్యక్తి లేదా తనకంటే అత్యధికంగా డబ్బు ఉన్న వ్యక్తి.. తన శుభకార్యానికి పిలిచాడని అనుకుందాం.. అప్పుడు అతడు ఎక్కువగా డబ్బున్న వ్యక్తులని ఆదరిస్తూ ఉంటాడు. వారి ముందు తమ గొప్పతనాన్ని చాటుకునేలా హుందాగా వ్యవహరిస్తాడు. అయితే తమకంటే కాస్త డబ్బు తక్కువగా ఉండి.. సాదాసీదాగా ఉన్న వారి గురించి పెద్దగా పట్టించుకోరు. కనీసం భోజనం చేశారా? అన్న విషయం కూడా కొందరు అడగరు. ఎన్నో ప్రయాసలు పడి.. ఎంతో ఆదరిస్తారని ఆశపడి.. వచ్చిన వారికి ఈ పరిస్థితిని చూసి నిరాశ కలుగుతుంది. వాస్తవానికి ఇలాంటి వారు తమ శుభ కార్యానికి రావాలని ప్రేమతో పిలవరు.. కేవలం మొబైల్ లో లేదా గ్రూపులో కార్డ్స్ పెడుతూ ఉంటారు. ఇలాంటి వారి కార్యక్రమానికి వెళ్లకుండా ఉండడమే మంచిది.

అయితే ఒక సంస్థ లేదా కంపెనీలో పనిచేసే చిరు ఉద్యోగి పెళ్లికి.. పిలిస్తే తప్పకుండా వెళ్లాలని అంటున్నారు. ఎందుకంటే అలాంటి వారు తమ సంస్థ యజమాని వస్తున్నాడని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తుంటారు. అంతేకాకుండా తమ కుటుంబ సభ్యులందరినీ పరిచయం చేస్తూ ప్రత్యేక మర్యాదలు చేస్తారు. ఆహార విషయంలోనూ శ్రద్ధ తీసుకుంటారు.

దీనిని బట్టి చూస్తే మనం కోరే వాళ్ళ కన్నా.. మనల్ని ప్రేమించే వాళ్ళ ఇంటికి అతిథులుగా వెళ్లడం ఎంతో ఉత్తమం అని కొందరు పెద్దలు, మానసిక నిపుణులు తెలుపుతున్నారు. మనం కావాలని అనుకునే వారి ఇంటికి ఎప్పుడైనా వెళ్లవచ్చు అని.. అక్కడ వారి మర్యాదకు ఎలాంటి లోటు ఉండదని.. అంతేకాకుండా అలా వెళ్ళిన వారితో అక్కడున్న వారు ఎంతో సంతోషిస్తారని చెబుతున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 06.09.2026
www.mudranews.in | @mudranews



**వ్యాయామం కూడా తప్పనిసరి**

డైట్‌తో పాటు క్రమమైన శారీరక శ్రమ బరువు తగ్గడంలో కీలకం. పెద్దలకు వారానికి కనీసం 150 నిమిషాల మితమైన వ్యాయామం, వారానికి రెండు రోజులు కండరాల బలపరిచే వ్యాయామం చేయాలని CDC సూచిస్తోంది.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం











## తల్లే తొలిగురువు

**ముద్ర, శేరిలింగంపల్లి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ప్రతి ఒక్కరి జీవితంలో తల్లే తొలి గురువని, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని సీపీ అన్నారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గొప్ప బహుమతని పేర్కొన్నారు.విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన సీపీ.. ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. మహిళల రక్షణకు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ భూపతి, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి

**ముద్ర, మేడ్చల్–మల్కాజిగిరి, సెప్టెంబర్ 5:** విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రతి ఒక్కరి విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు.విద్యార్థుల కోణంలో ఆలోచించి సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. వారిలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, నిరంతర అభ్యాసం, విషయ పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించాలని కోరారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, వైఫల్యాల సమయంలో ధైర్యం చెప్పి మళ్లీ ప్రయత్నించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతిరోజూ 5–10 నిమిషాలు దినపత్రికలు చదివించడం ద్వారా సామాజిక అవగాహనతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి అన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ శాలువాలు, ప్రశంసాపత్రాలు, పూల మొక్కలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలరాజుకు పురస్కారం

**ముద్ర, కూకట్పల్లి :** జగద్గిరిగుట్టలోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డమీది బాలరాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాల్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారిణి (డిఈఓ) రేణుక చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ.. తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం ఎంతో గర్వంగా, అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా నివసించే ప్రాంతంలో అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే ఈ పాఠశాలను నెలకొల్పినట్లు చెప్పారు. ప్రైవేట్ విద్య సాధారణ ప్రజలకు అందని ద్రాక్షలా మారిన నేటి రోజుల్లో, బడుగు బలహీన వర్గాల స్తోమతకు తగ్గట్టుగా తక్కువ రుసుములతో విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు.విద్యాబోధనతో పాటు తాను చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను చేరువ చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు ఈ గౌరవం దక్కడానికి సహకరించిన జిల్లా 'ట్రస్మా' ,కుత్బుల్లాపూర్ 'ట్రప్సా' నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా సర్వేపల్లి జయంతి

**ముద్ర, కూకట్ పల్లి:** కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... సాధారణ ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, భారతదేశ రెండవ ఉపరాష్ట్రపతిగా, ఆ తర్వాత రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలందించిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదినాన్ని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకోవడం ప్రతి ఉపాధ్యాయుడికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, బాబు, నరేష్ కుమార్, మూర్తి, సుబ్బారెడ్డి, డేవిడ్, రత్నారావు, వెంకటేష్ యాదవ్, వేణు, సంతోష్, రాజారావు, శ్రీనివాస్, చెన్నకేశవులు, సుకృతం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, ప్రదీప్, క్రాంతి కుమార్, రాము, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కృషి, త్యాగం అనుపమానం

**ముద్ర, కూకట్‌పల్లి :** "అమ్మ జన్మనిస్తే.. గురువు జీవితానికి అర్థాన్ని, గమ్యాన్ని ఇస్తాడు" అని అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఎల్లమ్మబండలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేష్ గౌడ్, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురువు లేనిదే విద్య, విద్య లేనిదే జ్ఞానం ఉండదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం జ్ఞానాన్ని అందించడమే కాకుండా, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. వారి నిస్వార్థ సేవలను, త్యాగాలను స్మరించుకోవడానికే ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధాపద్మజ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అనసూయ, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, పాండుగౌడ్, మల్లేష్, ఖలీమ్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గురువులకు ఘన సన్మానం

**ముద్ర, కొండాపూర్, సెప్టెంబర్ 5:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో విశ్రాంత ఆచార్యులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, మహిళా సంక్షేమ కేంద్రం ఉపాధ్యాయులు కలిపి 36 మందిని ఘనంగా సన్మానించారు.ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, చండ్ర రాజేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ వి. చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. సీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు, మహిళా సంక్షేమ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనపై పోరుబాట

## ఉద్యోగాలు లేవి.?

**ముద్ర, చేవెళ్ళ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం షాబాద్ మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాగర్‌గూడ ప్రధాన కూడలి నుంచి షాబాద్ మండల కేంద్రం వరకు మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 18 డిక్లరేషన్లు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిందని, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. వంద రోజుల్లో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి.. వెయ్యి రోజులు పూర్తయినా లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి ఫ్యూచర్ సిటీ భూములపైనే ఉందని సబితా ఆరోపించారు.



రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం, నేరాలు పెరుగుతున్నాయని, కొత్త పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందన్నారు. హామీలను పూర్తిగా అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు.చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య కొత్తగా ఏ ప్రాజెక్టులు సాధించారో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు డిమాండ్ చేశారు. అనంతరం 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేయడంతో పాటు, ఇటీవల హత్యల్లో మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందించారు.

## హామీల అమలులో విఫలం

**ముద్ర, అల్వాల్, సెప్టెంబర్ 5:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో భారీ నిరసనలు నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. మల్కాజ్‌గిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 600 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. కానాజిగూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ



భూదేవినగర్, వెంకటాపురం, పీజేఆర్ విగ్రహం, ఎం.ఆర్.కృష్ణ రోడ్, జె.జె.నగర్, అల్వాల్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు సాగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలని, యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.సనత్‌నగర్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పద్మారావు నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. శేరిలింగంపల్లిలో మూసాపేట్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.చేవెళ్లలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించగా, బీఆర్ఎస్ నాయకులతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆరు గ్యారంటీల ప్రయోజనాలు అర్హులందరికీ అందించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని, వాటి అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని ఆయా నియోజకవర్గాల నాయకులు స్పష్టం చేశారు.

## వైభవంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

**హాజరైన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**ముద్ర, హైదరాబాద్, (కూకట్‌పల్లి):** ధరణి నగర్ ఆలయంలో మూడు రోజులుగా సాగిన వైదిక కార్యక్రమాలువేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా ప్రతిష్ఠాపన కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ధరణి నగర్, ఆల్విన్ కాలనీ, తులసి నగర్ లోని దేవాలయంలో శనివారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.వేద మంత్రాల మధ్య ప్రతిష్ఠాపన:దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి, శ్రీ మహా గణపతి, దేవసేన వల్లి సమేత సుబ్రహ్మణ్య స్వామి, అష్టనాగుల విగ్రహ ప్రతిష్ఠాపన కోసం గత మూడు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేదాంతం తాండవ కృష్ణ శర్మ వేదమంత్రోచ్ఛారణల తో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పాలకుర్తి రామమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు.శనివారం వేలాది మంది భక్తుల సమక్షంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య యంత్రాల స్థాపన అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమగుండాలలో చండీ హోమంతో సహా వివిధ హోమాలను నిర్వహించారు.భక్తుల సందడి – ప్రముఖుల హాజరు:ఈ మహోత్సవానికి ధరణి నగర్, ఆల్విన్ కాలనీ, తులసి నగర్ తో పాటు చుట్టుపక్కల కాలనీల నుండి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆలయ చైర్మన్ మల్లేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందర్యాదిగా తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారువేద పండితుల సేవలు:ఈ ప్రతిష్ఠాపన మహోత్సవంలో వేద బ్రాహ్మణులు బ్రహ్మశ్రీ పాలకుర్తి రామ్మూర్తి శర్మ, పాలకుర్తి అశ్విని శర్మ, శంకరమంచి యాదగిరి శర్మ, పవన్ శర్మ, అవినాష్ శర్మ లతో పాటు ఆలయ నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పార్క్ స్థలాన్ని రాజకీయవివాదంగా మార్చొద్దు

**పీఏసీ చైర్మన్ అరెకెపూడి గాంధీ**



**ముద్ర, శేరిలింగంపల్లి:** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ కాలనీ లో గల పార్క్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ వాసులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన పీఏసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మిత్ర హిల్స్ కాలనీ సొసైటీ పార్కు కోసం కేటాయించేలా తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని చైర్మన్ గాంధీ తెలిపారు. ఈ అంశాన్ని అనవసరంగా రాజకీయ వివాదంగా మార్చవద్దని కాలనీవాసులకు సూచించారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు మిమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ గాంధీ వ్యాఖ్యానించారు. అలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని సొసైటీ సభ్యులను కోరారు. గతంలో కొందరు కౌన్సిలర్లు తామే ఈ భూమిని పార్కు కోసం కేటాయించామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వారు కౌన్సిలర్లుగా ఉన్న సమయంలోనే అసలు మిత్ర హిల్స్ కాలనీ ప్లాటింగ్ జరగలేదని గుర్తుచేశారు. 3500 గజాల స్థలాన్ని మిత్ర హిల్స్ సొసైటీకి పార్కు రూపంలో మరియు కమ్యూనిటీ హాల్ కోసం వినియోగించే వరకు పోరాటం కొనసాగిస్తానని చైర్మన్ ఆరెకపూడి గాంధీ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కోసం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసిన ఎమ్మెల్యే..కాలనీలో అందుబాటులో ఉన్న పార్కు స్థలాల్లో చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మన అందరింపైన ఉందని, రానున్న తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చదనం అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మిత్ర హిల్స్ కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, పార్క్ సమస్య కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని, నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, ఎవరూ అధైర్య పడకూడదు అని, పార్క్ సమస్య కు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చైర్మన్ గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## నార్సింగ్ సర్కిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కమిటీ



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరింప చేసేలా కృషి చేస్తానని నార్సింగి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మహేందర్ రెడ్డి అన్నారు. నార్సింగ్ సర్కిల్–45 పరిధిలో నూతన కాంట్రాక్టర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా మహేందర్ రెడ్డి, అధ్యక్షునిగా మాధవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా బాల మురళీకృష్ణ, జనరల్ సెక్రటరీగా దుద్దు శ్రీనివాస్, ట్రెజరర్‌గా రాంబాబు, జాయింట్ సెక్రటరీగా బాలరాజు ఎన్నికయ్యారు.అదేవిధంగా ముఖ్య సలహాదారులుగా దుద్దు దేవేందర్, కే. శ్రీనివాస్, ప్రేమ్ దాస్లను ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులుగా అవినాష్ రెడ్డి, అరవింద్, లోకేష్, శ్రీనివాస్, విజయ్, ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, శ్రీశైలం రెడ్డిలను మంత్రి ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

## 22-ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతు భూములను తొలగించాలి



**ముద్ర, కూకట్‌పల్లి :** 22–ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతులు, సామాన్యుల భూములను వెంటనే తొలగించి వారికి న్యాయం చేయాలని, భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద 'మహా దీక్ష' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, నిషేధిత భూముల జాబితా వల్ల రైతులు తమ సొంత భూములపై హక్కులు ఉండి కూడా అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ భారతి పోర్టల్‌లోని సాంకేతిక, పరిపాలనా లోపాలను సవరించి, రైతులకు కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు లేకుండా పారదర్శక సేవలు అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. "రైతులు, సామాన్యుల భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరిగినా బీజేపీ చూస్తూ ఊరుకోదు. 22–ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కే వరకు బీజేపీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ మహా దీక్షలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 6.09.2026
www.mudranews.in | @mudranews



## సెలబ్రిటీ డైట్‌ను చూసి ఫాలో కావద్దు

ఒక వ్యక్తికి పనిచేసిన డైట్ అందరికీ సరిపోదు. వయసు, బరువు, ఆరోగ్య పరిసితులు, మందులు, జీవనశైలి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని డాక్టర్ లేదా డైటీషియన్ సలహాతో బరువు తగ్గే ప్రణాళిక రూపొందించుకోవడం మంచిది.



## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం**
**జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్**



**ముద్ర, కరీంనగర్ :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో "చలో హైదరాబాద్" పోస్టర్‌ను విడుదల చేసిన వారు, సెప్టెంబర్ 8న కరీంనగర్ టీఎన్జీవోల కమ్యూనిటీ భవనంలో జరిగే ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు భారీగా హాజరుకావాలని కోరారు. నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (EHS) అమలులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆశించిన పురోగతి లేదని, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కారం కాక అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనను ముందుకు నడిపించేది ఉద్యోగులేనని స్పష్టం చేశారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని పేర్కొంటూ, EHS లోపాలను సరిదిద్ది, పెండింగ్ బకాయిలు, పీఆర్సీ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 8న కరీంనగర్‌లో జరిగే సన్నాహక సమావేశంతో పాటు, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే "చలో హైదరాబాద్" కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికే శిక్షణా కార్యక్రమాలు

**ముద్ర, కరీంనగర్ :** పట్టణంలోని డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో డా.ఎం గీత పాల్గొని మాట్లాడారు. తమ శాఖ పరిధిలో 881 మంది టేలరింగ్ చేస్తున్న మహిళలను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో చాలా సంఘాలకు 72 వేల స్కూల్ యూనిఫామ్‌లు కుట్టేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలిపారు. కుట్టు శిక్షణ పొందిన వారు నిత్యం సాధన చేసి నైపుణ్యాలు పెంపొందించుకుంటే శాఖ పరంగా ఎన్నో సబ్సిడీ రుణాలు, అవకాశాలు ఇస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కుట్టు శిక్షణ కార్యక్రమాలతో పాటు వైద్యపరంగా సహాయ సహకారాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ బీఎన్. రావు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా




**ముద్ర, ధర్మపురి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలో నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థుల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

## కూతురు ఆత్మహత్య.. తట్టుకోలేక ఆగిన తల్లి గుండె



**ముద్ర, కరీంనగర్ :** కన్న కూతురి మరణవార్త విన్న ఆ తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కూతురు మృతదేహాన్ని చూసిన ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం తర్వాత కూతురు అంత్యక్రియలు చేస్తున్న సమయంలో తల్లిగుండె పగిలి అక్కడే కుప్పకూలింది. గంటల వ్యవధిలో తల్లీకూతురు మృతి చెందడంతో రూరల్ మండలం దుర్శేడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, గ్రామస్థుల వివరాల ప్రకారం దుర్శేడ్‌కు చెందిన చీలుపల్లి శ్రీవిద్య(36)కు జగిత్యాల జిల్లాకు చెందిన తిరుపతితో 10 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఓ పాప ఉంది. శ్రీవిద్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతుంది. నెల రోజులుగా ఆమె భర్త హైదరాబాద్‌లోని పెట్రోల్‌బంకులో పని చేస్తున్నాడు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న శ్రీవిద్య శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో స్నానాల గదికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చూడగా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కూతురు మృతితో తల్లి బిల్లా సవిత ఉదయం నుంచి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ కూతురి మృతదేహాన్ని వీడలేదు. సాయంత్రం గ్రామంలో శ్రీవిద్య అంత్యక్రియలు చేస్తున్న సమయంలో సవిత ఒక్కసారిగా కుప్పకూలింది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీవిద్య ఆత్మహత్య విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# గురువులే భావితరాల రూపశిల్పులు





**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ధైర్యంగా, నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గురువులే భావితరాల రూపశిల్పులని, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు రెండో ఇల్లులాంటిదని, పాఠ్యాంశాలతో పాటు శుభ్రత, ధైర్యం, క్రమశిక్షణ నేర్పించాలని సూచించారు. తన ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను నిత్యం గుర్తు చేసుకుంటానన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఎఫ్.ఎల్.ఎన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. మండలాల వారీగా పాఠశాలల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామని, మరిన్ని CSR నిధులతో వసతులు మెరుగుపరుస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని, భయంతో కాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అన్నారు.

మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా బోధించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఆధునీకరించిన సైన్స్ మ్యూజియాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో డీఈవో చైతన్య జైనీ, విద్యాశాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి సన్మానించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం సెక్రటరీ భగవంతయ్య, స్పెషల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, దాసి శ్రీనివాస్, మహేందర్, జీ సీడీఓ ఉమారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఎంఈఓ లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నారాయణపూర్ ముంపు గ్రామ బాధితులకు అండగా కొత్త జయపాల్ రెడ్డి

- గ్రామస్తులతో కలిసి సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన జయపాల్ రెడ్డి
- ముంపు గ్రామంగా ప్రకటించేంత వరకూ... అండగా నిలుస్తామని భరోసా



**ముద్ర , కరీంనగర్ :** నారాయణపూర్ ముంపు గ్రామ బాధితులకు బీఆర్ఎస్ సీనియర్ నేత కొత్త జయపాల్ రెడ్డి అండగా నిలిచారు. కరీంనగర్ లో నిర్వహించిన యువ గర్జన సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. నగరంలోని త్రిదా హోటల్లో కేటీఆర్ ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త జయపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నారాయణపూర్ ముంపు గ్రామ బాధితులను ఆయన కేటీఆర్ వద్దకు తీసుకెళ్లారు. ముంపు గ్రామ బాధితుల సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. నారాయణపూర్ గ్రామస్తుల సమస్యలను సమూలంగా వివరించారు. కాగా సానుకూలంగా స్పందించిన కేటీఆర్ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ముంపుగ్రామంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. నారాయణ పూర్ గ్రామస్తులకు అండగా నిలుస్తానని... జయపాల్ రెడ్డి భరోసా కల్పించారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం ముంపుగ్రామ బాధితులకు బోజన వసతి కల్పించారు.

## పనీర్, డెయిరీ ఉత్పత్తి కేంద్రాలపై టీజీ సేఫ్ దాడులు

**ముద్ర, హైదరాబాద్:** నగరంలోని పనీర్, డెయిరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ (TG SAFE) అధికారుల దాడులు చేశారు. 12 ప్రత్యేక బృందాలతో 14 డెయిరీ యూనిట్లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీస్ సిబ్బంది, హెచ్ ఫాస్ట్ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. కొన్ని యూనిట్లలో పనీర్ తయారీలో పామాయిల్, గ్లిసరాల్ మోనోస్టియరేట్ వినియోగాన్ని గుర్తించారు. తనిఖీల సందర్భంగా పలు చోట్ల పారిశుద్ధ్యం, పరిశుభ్రత లోపాలు వెలుగుచూశాయి. పలు డెయిరీ యూనిట్లలో బొద్దింకలు, ఈగల తిరుగుతుండటాన్ని గమనించారు.

పలు కేంద్రాల్లో పాల సేకరణకు సంబంధించిన రికార్డులు లేవు. కల్తీపై అనుమానంతో 21 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు.

## గోషి, గొంగడితో వచ్చిన రసమయి ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించాడు?

**ఉపాధ్యాయ దినోత్సవం వేళ ఎమ్మెల్యే కవ్వంపల్లి వివాదాస్పద వ్యాఖ్యలు**



**ముద్ర, కరీంనగర్ :** ఉపాధ్యాయ దినోత్సవం రోజున మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను విమర్శిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని అరుంధతి కల్యాణ మండపంలో స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. పంపిణీ అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "చిన్న ఉద్యోగం.. బోడి టీచర్ ఉద్యోగం చేసిన నీకు ఇన్ని ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి?" అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాకముందు గోసి, గొంగడితో వచ్చావని, ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత ఎమ్మెల్యే అయిన నువ్వు ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా సంపాదించావంటూ విమర్శలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాజకీయ విమర్శలు చేసుకోవడం ఒక ఎత్తయితే.. ఉపాధ్యాయ వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమిటని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశంగా మారాయి.

## ఇళ్లల్లోకి చొరబడి చంపేస్తాం.. పాకిస్తాన్ కు మోదీ మాస్ వార్నింగ్



**ముద్ర, ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాల్లో రాజకీయ సందేశంతో పాటు సందర్భానికి తగ్గ భాష, యువతకు కనెక్ట్ అయ్యే పదజాలం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటుంది. తాజాగా శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది వేడుకల్లో ఆయన చేసిన ప్రసంగం కూడా ఇదే తరహాలో సాగింది. ఒకవైపు కాలేజీ పూర్వ విద్యార్థుల ఘనతను ప్రస్తావిస్తూ.. మరోవైపు 2013లో తాను చేసిన ప్రసంగాన్ని గుర్తు చేసుకుంటూ.. చివర్లో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేయడం ద్వారా మోదీ తన ప్రసంగాన్ని పలు కోణాల్లో మలిచారు. ప్రసంగంలో యువతను ఆకట్టుకునేలా మోదీ ఉపయోగించిన "ధురంధర్ కాకపోయినా.. ధూమ్ మచాయీ హై" అనే వ్యాఖ్య ప్రత్యేకంగా నిలిచింది. ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ.. తనదైన శైలిలో వారిని అభినందించారు. ఈ కాలేజీ నుంచి ఆర్థికవేత్తలు మాత్రమే కాకుండా కళాకారులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు వంటి అనేక రంగాలకు చెందిన ప్రముఖులు వెలుగులోకి వచ్చారని చెప్పారు.

**అరుణ్ జైట్లీ నుంచి సంజీవ్ సన్యాల్ వరకు..**

ఎస్ఆర్‌సీసీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మోదీ.. మాజీ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జైట్లీ ఎస్ఆర్‌సీసీలో చదువుకున్న విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయనతో జరిగిన సమావేశాల్లో కాలేజీ రోజుల నాటి సంఘటనలు తరచూ ప్రస్తావనకు వచ్చేవని చెప్పారు. ఒకే సంఘటనను ఆయన పదేపదే చెప్పేవారని సరదాగా వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం తన బృందంలో ఉన్న సంజీవ్ సన్యాల్ కూడా ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థేనని మోదీ పేర్కొన్నారు. ఇలా వ్యక్తిగత జ్ఞాపకాలను ప్రస్తావించడం ద్వారా ప్రసంగాన్ని కేవలం రాజకీయ ఉపన్యాసంగా కాకుండా.. కాలేజీ జ్ఞాపకాలు, విద్యార్థుల భవిష్యత్తు, దేశ ప్రగతి వంటి అంశాలతో ముడిపెట్టారు.

**2013 ప్రసంగం.. మళ్లీ ఎందుకు గుర్తు చేశారు?**

మోదీ ప్రసంగంలో మరో కీలక అంశం 2013 నాటి ఎస్ఆర్‌సీసీ పర్యటన. అప్పట్లో తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలో భాగంగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ.. తాను ఆ వేదికను రాజకీయ విమర్శల కోసం ఉపయోగించకుండా ఒక దార్శనికతను వివరించానని చెప్పారు. ఆ ప్రసంగం అప్పట్లో ఒక అలను సృష్టించిందని దాదాపు 13-14 ఏళ్ల తర్వాత కూడా దాని ప్రభావం గురించి చర్చ జరుగుతోందని మోదీ వ్యాఖ్యానించారు. అప్పటి పరిస్థితులను అర్థం చేసుకోవాలంటే ఆ కాలం నాటి వార్తలను ఇంటర్నెట్‌లో పరిశీలించాలని యువతకు సూచించారు.

**అసలు హీట్ ఇక్కడే.. పాక్‌కు మోదీ వార్నింగ్**

ప్రసంగం చివరి భాగంలో మోదీ జాతీయ భద్రత అంశాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులకు భారత సాయుధ దళాలు తగిన సమాధానం ఇస్తున్నాయని అన్నారు. పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారత బలగాలు వారి భూభాగంలోకి వారి ఇళ్లలోకి ప్రవేశించి చంపేస్తామని సందేశాన్ని స్పష్టంగా వినిపించారు. అదే సమయంలో జమ్మూకశ్మీర్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు శాంతి విస్తరిస్తోందని, మావోయిస్టు ఉగ్రవాదం, నక్సలిజంపై భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు.మొత్తంగా చూస్తే.. ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల వేదికగా సాగిన మోదీ ప్రసంగం కాలేజీ వారసత్వం, 2013 జ్ఞాపకాలు, యువతతో కనెక్ట్ అయ్యే భాష, దేశ ప్రగతి, జాతీయ భద్రత వంటి అంశాలను ఒకే కథనంలో కలిపింది. "ధూమ్ మచాయీ హై" అంటూ యువతను నవ్వించిన అదే ప్రసంగం.. పాకిస్థాన్‌కు "దుస్సాహసం చేస్తే ఇళ్లలోకి చొరబడి చంపేస్తాం" అనే గంభీరమైన రాజకీయ సందేశంతో ముగిసింది. ఇదే ఈ ప్రసంగానికి ప్రత్యేకతగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 06.09.2026

www.mudranews.in | @mudranews



**కఠినమైన డైట్ కంటే బ్యాలెన్స్‌డ్ డైట్ ముఖ్యం**

బరువు తగ్గాలంటే భోజనం పూర్తిగా మానేయడం కంటే కూరగాయలు, ప్రోటీన్, తృణధాన్యాలు వంటి పోషకాహారాన్ని సరైన పరిమాణంలో తీసుకోవడం మంచిది.



# విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం

**ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** విద్యార్థిని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవం, దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. గురువులను సన్మానించుకోవడం అంటే ఒక జన్మదిన ధన్యమే అని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత మనం ఎక్కువ గౌరవించేది గురువులని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారతదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా విద్యా రంగం పై పెద్దపీట వేసిందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ముందుగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పిస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని, వారి బోధన, ప్రోత్సాహం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ఆహారం అందేలా ఉపాధ్యాయులు తపనతో పనిచేయాలని అన్నారు. అనంతరం 80 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలు,మెమెంటో శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయచైర్మన్ అవేజ్ చిస్తి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా విద్యాధికారి బిక్షపతి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అరుణ

**ముద్ర, తుర్కపల్లి:** “ఉపాధ్యాయుడి కృషికి నిజమైన గుర్తింపు.. విద్యార్థుల విజయమే” అనే మాటకు నిదర్శనంగా నిలుస్తూ తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. అరుణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు జిల్లా విద్యాశాఖ ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా విద్యాధికారి బిక్షపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.





## విద్యతో పాటు నైతిక విలువలు ముఖ్యం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 5:** విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, మంచి నడవడికను నేర్పాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కుల కంటే సంస్కారం, సత్యం, పెద్దలను గౌరవించడం వంటి విలువలే విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన పునాదులన్నారు. వివేకం లేని విద్య శూన్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మొదటి తరం విద్యార్థులకు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పాత్రను కూడా పోషించి సరైన మార్గంలో తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తన విద్యాభ్యాసంలో గురువులు ఉచితంగా బోధించి అం దించిన ప్రోత్సాహాన్నే ఈ సందర్భంగా ఆయన భావోద్వే గంతో గుర్తుచేసుకున్నారు. మంచి సమాజ నిర్మాణంలో ఇల్లు, పాఠశాల పాత్ర కీలకమైనవని తెలిపారు. ఇన్‌చార్జి డీఈవో సదానందం మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల నమోదు పెరగడంతో పాటు పదవ తరగతి ఫలితాలు, ఎఫ్ఆర్ఎస్ అమలులో జిల్లా ముందంజలో ఉందన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ మెమొంటోలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**ఫీజు రీయంబర్స్మెంట్ పై హోరెత్తిన నినాదాలు.. జిల్లాల్లో నిరసన ర్యాలీలు**



## రేవంత్ రెడ్డికి దోచుకోవడం.. దాచుకోవడమే పని

**సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దోచుకోవడమే దాచుకోవడమే పని గా పెట్టుకున్నారనిసూర్యాపేట ఎమ్మెల్యే గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ సమరభేరి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18 గంటలు పనిచేస్తుంది నిజమేనని అయితే ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా డబ్బులు సంపాదించడం వాటాల పంపకాల కోసమే పనిచేస్తున్నారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించిన ఆయన వరంగల్ నుండి వచ్చే దాంట్లో వాటా అడిగినందుకే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోని అవినీతిపై మిగతా మంత్రులు, నేతలు కూడా భవిష్యత్తులో ప్రశ్నిస్తారని వ్యాఖ్యానించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి డౌన్‌ఫాల్ ప్రారంభమైందని జగదీశ్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన కరెంట్, నీటిని కూడా ప్రస్తుత ప్రభుత్వం సక్రమంగా అందించలేకపోతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడం కోసమే పనిచేస్తోంది’ అంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ లు , కౌన్సిలర్ లు, విద్యార్థి విభాగం నాయకులు , యువజన విభాగం నాయకులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

## హామీలు అమలులో విఫలం

**మాజీ మంత్రి పువ్వాడ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం సెప్టెంబరు 5 :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు







ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. నిరుద్యోగులు, విద్యార్థుల డిమాండ్ల సాధనకై ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి జడ్పీ సెంటర్ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావుతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా వేలాది కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు చెల్లించలేదని, గురుకులాల్లో కనీస వసతులు కరువయ్యాయని మండిపడ్డారు. రూ.4 వేల నిరుద్యోగ భృతి, ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఆర్జేసి కృష్ణ, పగడాల నాగరాజు, భీరెడ్డి నాగచంద్ర రెడ్డి, బచ్చు విజయ్ కుమార్, కర్నాటి కృష్ణ, మక్బుల్, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో ర్యాలీ

ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను, విద్యార్థులను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు పూర్తయినా తన హామీలను నెరవేర్చకుండా పూర్తిగా మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను





ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులు, నిరుద్యోగులతో కలసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ, వంద రోజుల్లో లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వెయ్యి రోజులు దాటినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా కార్డులు, విద్యార్థినులకు ఉచిత స్కూటీల హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ, గురుకుల వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్‌పై వెంటనే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నిరుద్యోగులు, విద్యార్థుల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సండ్ర హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పిజి కళాశాల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్ వరకు విద్యార్థులతో నిర్వహించిన ఈ ప్రదర్శన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ ఇతర సంఘాల నాయకులు ప్రసంగించారు.గత నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10,150 కోట్లు పెండింగ్‌లో ఉండటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని, వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే ప్రజాప్రతినిధులు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

## జల నారాయణ స్వామికి మంగళహారతులు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. శనివారం మృగశిర నక్షత్రం పురస్కరించుకొని శ్రీ పద్మావతి అమ్మవారి కి నవకలశ పంచామృత అభిషేకాన్ని అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారిని పట్టు చీరతో దివ్యాభరణాలతో పుష్ప మాలికలతో అలంకరించి అష్టలక్ష్మి మంటపంలోకొలువుదీర్చారు. అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హావనం నిర్వహించారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. శ్రీ పద్మావతి అమ్మవారి కి అర్చక స్వాములు విశేషంగా సహస్ర కుంకుమార్చన సేవ నిర్వహించారు.

## హెల్మెట్లు అందజేత



**ముద్ర, తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం గుజ్జ వానికుంట తండా సర్పంచ్ గూగులోత్ దూప్ సింగ్ నాయక్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులకు హెల్మెట్లు బహుకరించారు. సుదూర ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాలపై విధులకు వచ్చే సిబ్బంది రోడ్డు ప్రమాదాల నుంచి సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధీరావత్ సునీత లింగ నాయక్, గుగులోత్ రాజేందర్ నాయక్ పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**ఉత్సవాలకు మున్సిపాలిటీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తాం**

**మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్**





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి, భువనగిరి:** భువనగిరి పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐక్యమత్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం భువనగిరి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో వినాయక ఉత్సవాలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.వినాయక ఉత్సవాల నిర్వహణకు, 9 రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలకు, చివరి రోజు నిమజ్జనానికి మున్సిపాలిటీ తరపున ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపం వద్ద లైటింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.భువనగిరి గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా పసుపునూరి నాగ భూషణంఈ సందర్భంగా భువనగిరి గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా పసుపునూరి నాగభూషణం ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులు పసుపునూరి నాగభూషణంని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగాళ్లపల్లి రవి కుమార్ మాట్లాడుతూ నూతన అధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో ఉత్సవాలు మరింత ఘనంగా జరగాలని ఆకాంక్షించారు. యువత భక్తి భావంతో ఉత్సవాలను నిర్వహించాలని, మట్టి వినాయకులనే వాడాలని సూచించారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి నాయకులు తాడేం పాండు, పూస శ్రీను, దేవరకొండ నరసింహచారి, సూర్వి శ్రీనివాస్ గౌడ్, కూర శివకుమార్, ఉడుత భాస్కర్, కోటి రమేష్, యేదుగ ని సంతోష్ గణేష్, పట్టణంలోని వివిధ వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 5 :** జిల్లాలో పదవీకాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కు వెంటనే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి, నూతన పాలకవర్గాలను ఎన్నుకోవాలని కోరుతూ టేకులపల్లి సహకార సంఘం చైర్మన్ బి. రెడ్డి నాగచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ పదవీకాలం పూర్తయినప్పటికీ కొన్ని సహకార సంఘాలకు ఇప్పటివరకు ఎన్నికలు జరపకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను మళ్లీ మళ్లీ వాయిదా వేయకుండా తక్షణమే షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా కొన్ని సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. సహకార సంఘాల్లోని రైతు సభ్యులందరికీ తమ నాయకులను ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకునే హక్కు ఉందనే విషయాన్ని గుర్తుచేశారు. నామినేటెడ్ విధానం వల్ల రైతు స్వయంప్రతిపత్తి దెబ్బతింటుందని, కాబట్టి ప్రజాస్వామ్య బద్ధంగానే ఎన్నికలు నిర్వహించి చైర్మన్లు, పాలకవర్గాలను ఎన్నుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షులు నాగుబండి శ్రీనివాసరావు, వీర మోహన్ రెడ్డి, చావా వేణు, గండ్ర సోమారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పి. అంజయ్య, చెన్నయ్య, తన్నీరు సత్యనారాయణ, జె. లక్ష్మణ్ నాయక్, లక్ష్మణరావు, దారా జయశ్రీ, బి. వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్లకు తుది జాబితాలో స్థానం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 5 :** ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరూ తుది జాబితాలో తమ ఓటు హక్కును పొందేలా పక్కాగా చర్యలు చేపడుతున్నట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇఆర్ఓలతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీ విధానంపై చర్చించారు. ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా జాబితాలోని 10,85,927 మంది ఓటర్లలో మ్యాపింగ్ లేని, అనామలీస్ ఉన్న 1,75,858 మంది ఓటర్లకు ఈసిఐ షెడ్యూల్ ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నామని, ఇప్పటివరకు 1,32,817 మందికి నోటీసులు అందజేసి 14,680 మందికి హియరింగ్ ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు.నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వయస్సు ఆధారంగా ఈసిఐ సూచించిన పత్రాలను సమర్పించాలని కలెక్టర్ కోరారు. అలాగే 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండే అర్హులైన వారు ఫారమ్–6 ద్వారా కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడిస్తూ, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్ , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 06.09.2026
www.mudranews.in | @mudranews



**నెలలో 10 కేజీలు తగ్గడం సురక్షితమేనా?**



సాధారణంగా నెలకు 10 కేజీల బరువు తగ్గడం చాలా వేగవంతమైనదిగా పరిగణించవచ్చు. ఆరోగ్యకరమైన, క్రమమైన బరువు తగ్గింపు సాధారణంగా వారానికి సుమారు 0.5–0.9 కేజీల వరకు ఉండాలని నిపుణుల మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.

# 'ఉపాధ్యాయుడు' సమాజానికి దిక్సూచి

**పిల్లలను విద్యావంతులుగా తీర్చి దిద్దాలి**
**కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలుపు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడు....పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత మీపైనే ఉందని కలెక్టర్ ప్రతిమ సింగ్ పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐడిఓసిలో గురు పూజోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదేనని, గురువుకు మించిన దైవం ఈ లోకంలో లేదని పేర్కొన్నారు. విద్యా బోధనలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, విద్యకు ప్రథమ ప్రాధాన్యతనివ్వడమేనని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సమాంతరంగా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులని అన్నారు. విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి, సత్కరించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతమైన ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అభినందించారు. ఉపాధ్యాయుల మోటివేషన్ వల్లే తాను సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధం అయ్యానని. తన ఉన్నతికి దోహదపడిందని కాబట్టే తాను ఐ.ఏ.ఎస్ కాగలిగాను అని ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తూ, ఇదే కృషితో మన జిల్లా ఉత్తమ ఫలితాలతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చి లుమల సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు తదితరులు ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికైన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ.డి శ్రీనివాసరావు, సీఎంఓ రాజు, ఏఎంఓ సుదర్శనమూర్తి, ఏ.ఎస్.ఓ నవీన్,ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్కూల్ కేజీబీవీలో శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, మార్గదర్శకత్వం ఉంటుందని అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఉమాదేవిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యారంగానికి ఆమె అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం విద్యార్థినులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. బాలికలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను పోలీసు అక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు.విద్యార్థినుల విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంఈఓ, పాఠశాల అధ్యాపకులు, సీఐలు సందీప్‌రెడ్డి, రంగాకృష్ణ, ఎస్ఐ నర్సింలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.చిలప్ చెడ్ పోలీస్ స్టేషన్ తనిఖీపోలీస్ స్టేషన్‌లలో సమర్థవంతమైన పోలీసింగ్‌తో పాటు రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం చిలప్ చెడ్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీస్ సిబ్బంది కిట్‌ను పరిశీలించారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు, స్టేషన్ డైరీలు, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్య నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఆపదలో ఉన్నవారికి తక్షణ పోలీస్ సహాయం అందేలా 112 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎస్పీ వెంట డియస్పి నరేందర్ గౌడ్, సీఐలు సందీప్ రెడ్డి, రంగా కృష్ణ, ఎస్సై నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులతోనే సమాజ సమూల మార్పు సాధ్యం

**సూర్యాపేటను విద్యా రంగంలో అగ్రభాగాన నిలుపుదాం**
**నా ప్రస్థానానికి ఎదుగుదలకు గురువులే పునాది**
**గురుపూజోత్సవ వేడుకల్లో**
**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**ముద్ర, సూర్యాపేట:** సమాజంలో బలమైన మార్పు తీసుకురావాలన్నా, ఒక ఉత్తమమైన రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించాలన్నా అది కేవలం ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సభా ప్రాంగణంలో కలెక్టర్ మాట్లాడుతూ తన జీవిత ప్రయాణంలో గురువుల పాత్రను గుర్తుచేసుకుని, ఉపాధ్యాయ లోకానికి శిరస్సు వంచి నమస్కరిస్తూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టుకతోనే బడి ప్రయాణం.. నా గురువులే నా సర్వస్వంతన బాల్యం, విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకుంటూ కలెక్టర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నేను పుట్టి పెరిగింది మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్ తాలూకా సౌందనే గ్రామంలో. నా తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే కావడంతో, నా బడి ప్రయాణం నేను పుట్టిన రోజు నుంచే మొదలైంది. ఆ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచే నా అక్షరాభ్యాసం సాగిందని తెలిపారు. అనంతరం సాతారాలోని సైనిక్ స్కూల్, ఇంజనీరింగ్, ఆపై యూపీఎస్సీ ప్రస్థానంలో తనకు మార్గదర్శనం చేసిన ప్రతి ఒక్క గురువును ఆయన పేరుపేరునా స్మరించుకున్నారు. సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చిన తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ లోని గురువులతో పాటు, తన మొదటి కలెక్టర్ సత్యనారాయణ, శరత్, వెంకట్రావు వంటి సీనియర్ అధికారుల వద్ద జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారుల నుంచి కూడా ఎన్నో విషయాలు నేర్చుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని వినమ్రంగా చెప్పారు.

**ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రత్యేక ప్రశంసా పత్రాలు**

సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో ఇచ్చే ప్రశంసా పత్రాలు కొన్ని పరిమితులకు లోబడి ఉంటాయని, అందుకే ఈసారి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యా రంగంలో నిరంతరం శ్రమిస్తున్న వారందరికీ ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ మేరకు డిఈఓ పరిధిలోని పాఠశాలలతో పాటు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, రెసిడెన్షియల్, వెల్ఫేర్ పాఠశాలల ఉపాధ్యాయులను కూడా ఈసారి అవార్డులకు ఎంపిక చేసి, కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేసినట్లు వివరించారు. ఎంత సాంకేతికత వచ్చినా, కృత్రిమ మేధ పెరిగినా విద్యార్థిని వ్యక్తిగతంగా సరైన మార్గంలో నడిపించే గురువు స్థానాన్ని ఏ యంత్రమూ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు.పిల్లల్లో సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెంచాలి విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాల నాలెడ్జ్, చదవడం, రాయడం బోధించడమే కాకుండా.. మారుతున్న సమాజంలో ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే నిర్ణయాత్మక శక్తిని, మానవతా విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పిలుపు నిచ్చారు.సూర్యాపేట విద్యాశాఖ 'టేకాఫ్' దశలో ఉందిసూర్యాపేట జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని, ఇక్కడి విద్యా రంగం ప్రస్తుతం ఒక సరికొత్త టేకాఫ్ దశలో ఉందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇక్కడి నుంచి జిల్లా విద్యాశాఖ పురోగతికి ఆకాశమే హద్దు కావాలన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యా రంగాన్ని ముందుకు నడిపించేందుకు ఉపాధ్యాయులలో ఉన్న ఆ విప్లవాత్మకమైన స్ఫూర్తిని గౌరవించేందుకే ఈ వేదిక అని కొనియాడారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా పేరులోనే ఉన్న సూర్యుడిలాగా, ఇక్కడి విద్యా రంగం కూడా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి వెలగాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, డిఐఓ సులోచన రాణి, ఆర్ సి ఓ లు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది మోసపూరిత పాలన

**మాజీ డిప్యూటీ స్పీకర్**
**పద్మా దేవేందర్‌రెడ్డి**





**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన పూర్తిగా మోసపూరితంగా సాగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. శనివారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద మహిళా సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, బంజారా మహిళలతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ, కోలాటం ఆడుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన తులం బంగారం, ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. 33 నెలల కాలానికి ఒక్కో మహిళకు సుమారు రూ.82,500 బకాయి పడినట్లేనని పేర్కొన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.33 నెలల కాలానికి వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు రూ.66 వేల చొప్పున బకాయి ఉందని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. మాజీ మున్సిపల్ చైర్మన్ లు అరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, అకిరెడ్డి కృష్ణ రెడ్డి, మామిడ్ల ఆంజనేయులు, చౌదరి సుప్రభాత్ రావు, అనీస్ ఫాతిమా, జుబెర్ అహ్మద్, దీపక్ కుమార్, ఉదయ్ కుమార్, సోహెల్, అంకం చంద్రకళ, మాయ మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, మాధవి రాజు, పుట్టి. విజయలక్ష్మి , చౌదరి చరిత, అంజాగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, కిష్టయ్య, ప్రభావతి, సుజాత, రాధా, లత పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గిరి రామలింగం




ముద్ర, దేవరకొండ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన గిరి రామలింగం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ యెగితారాణ, ఎంజేపీ గురుకుల కార్యదర్శి సైదులు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. రామలింగం 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం మేడ్చల్–మల్కాజిగిరి ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలలో సాంఘికశాస్త్రం (పీజీటీ) ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. మండలవాసి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నందున గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన ప్రజలతో పాటు, పలువురు విద్యావంతులు మండలవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఉచిత మెగా ఆరోగ్య వైద్య శిబిరం ప్రారంభం



**ముద్ర, దేవరకొండ:** చందంపేట మండలంలోని పోలేపల్లి క్రాస్ రోడ్డులో వడిత్యా రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆరోగ్య వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వడిత్యా రమేష్ నాయక్ తో కలిసి పి ఎ సి స్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాలే నరసింహారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ పేద ప్రజలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమేష్ నాయక్ అభినందిస్తూ ఈ కార్యక్రమం ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ ద్వారా పెద్ద ఉపశమనం లభిస్తుందని అన్నారు.. కావున చందంపేట మండల ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, చందంపేట మండల ప్రజలు పాల్గొన్నారు.

## పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి: మండలంలోని కోల్‌ముంతలపాడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి జానకి రాములు గారు పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుత బెట్ట వాతావరణ పరిస్థితుల్లో పంట ఎదుగుదలకు యూరియా ద్రావణం, 19:19:19 లేదా 13:0:45 వంటి నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకోవాలని సూచించారు.పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 0.5 గ్రాముల ఎసిటామిప్రిడ్ మందుల్లో ఏదో ఒకదానిని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పురుగుల ఉధృతిని గమనిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.సన్న రకం వరి రైతులకు ముఖ్య సమాచారంప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న రకం వరి వడ్లను సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్దకు పాసుపుస్తకం, విత్తనాల కొనుగోలు బిల్లు తీసుకెళ్లి ఆన్‌లైన్ బుకింగ్ /నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.బోనస్ పొందేందుకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి. సెప్టెంబర్ 10వ తేదీలోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జానకి రాములు గారు

## భువనగిరి గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడిగా పసుపునూరి నాగభూషణం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా పసుపునూరి నాగభూషణం ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఎం ఎన్ ఆర్ గార్డెన్ లో జరిగిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయనను ఏకంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులు పసుపునూరి నాగభూషణంని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షులుగా పసుపునూరి నాగభూషణంని పట్టణంలోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.సూచించారు. ఈ కార్యక్రమంలో కోల్‌ముంతలపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555